సాక్షి
తిరుపతి
గురువారం । 13 । ఫిబ్రవరి । 2025

# పరిపూర్ణం.. తెప్పోత్సవం




తెప్పపై కొలువైన దేవదేవేరులు (ఇన్‌సెట్) పుష్కరిణిలో విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి

శ్రీగోవిందరాజస్వామివారి ఆలయ పుష్కరిణిలో ఏడు రోజుల పాటు నిర్వహించిన తెప్పోత్సవాలు బుధవారంతో పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం జరిపించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారు పుష్కరిణికి వేంచేపు చేశారు. సర్వాలంకారభూషితులైన దేవదేవేరులు తెప్పపై కొలువుదీరి పుష్కరిణిలో ఏడు ప్రదక్షిణలు చేస్తూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయపాల్గొన్నారు.

– తిరుపతి కల్చరల్

## వైభవం.. గరుడోత్సవం



మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని తిరుమలలో గరుడునిపై ఊరేగుతున్న శ్రీమలయప్పస్వామివారు

## న్యూస్‌రీల్

### వేదిక్ వర్సిటీ రిజిస్ట్రార్‌గా భాస్కరుడు



బాధ్యతలు స్వీకరిస్తున్న భాస్కరుడు

తిరుపతి సిటీ : ఎస్వీ వేదిక్ వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఆచార్య పోకల భాస్కరుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు. దేవదేవుడు అనుగ్రహించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని వెల్లడించారు.

### వెండి ఆభరణాల సమర్పణ



ఆలయంలో దాతలు, అధికారులు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలోని కామాక్షి అమ్మవారికి 9.115 కిలోల వెండి ఆభరణాలను తిరుమలకు చెందిన ఎస్వీ నరహరి దంపతులు బుధవారం సమర్పించారు. సుమారు రూ.9.28 లక్షల విలువ చేసే 12 రకాల ఆభరణాలను కపిలతీర్థం ఆలయంలోని ఊంజల్ మండపం వద్ద దాతల నుంచి టీటీడీ జేఈఓ వి.వీరబ్రహ్మం అందుకున్నారు. అనంతరం ఆభరణాలలోని కిరీటం, రెండు చెవులు, నాలుగు చేతులు, రెండు పాదాలు, రెండు పీఠాలు, వెండి చీరకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. దాత ఎస్వీ నరహరి దంపతులను సత్కరించి, ప్రసాదాలు అందించారు. ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ కె.సుబ్బరాజు, సూపరింటెండెంట్ కేపీ చంద్రశేఖర్, డీఈ మల్లయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్ పాల్గొన్నారు.

### 'వసతి' మరమ్మతులపై సమీక్ష



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల మరమ్మతులకు ఈ నెల 15న ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. అధికారులు ఇచ్చే నివేదికలో అన్ని రకాల వసతులకు సంబంధించి అంచనాల ప్రతిపాదనలు పూర్తి స్థాయిలో ఉండాలని స్పష్టం చేశారు. శాఖాపరమైన నిధులతోపాటు అదనంగా అవసరమైన నిధులను సీఎస్ఆర్, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్, ఎంపీ లాడ్స్ తదితరాల నుంచి వినియోగిద్దామన్నారు. నిధులు మంజూరు చేసిన వెంటనే నాణ్యంగా, సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతిపాదనలు పంపిన తర్వాత ఇదే అంశంపై 17వ తేదీన మరోసారి సమీక్షించనున్నట్లు వెల్లడించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి, ఈఈ బాలసుబ్రమణ్యంరెడ్డి, బీసీ సంక్షేమ అధికారి చంద్రశేఖర్, గిరిజన సంక్షేమ అధికారి సూర్యనారాయణ, జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త రేష్మ, అంబేద్కర్ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త గీత పాల్గొన్నారు.

### 15న శ్రీకాళహస్తిలో జాబ్ మేళా

శ్రీకాళహస్తి:పట్టణంలోని విక్రమ్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, కళాశాల ప్రిన్సిపల్ పట్టాభి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, బీటెక్, డిప్లొమా, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు మేళాకు హాజరుకావచ్చని వెల్లడించారు. ఆధార్‌కార్డు, విద్యార్హతల జిరాక్స్, బయోడేటా ఫామ్‌తో ఉదయం 9గంటలకు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు ముందుగా సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 7989509540, 8919889609 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### 19న లెక్చరర్ పోస్టులకు ఇంటర్వ్యూ

తిరుపతి తుడా : స్విమ్స్‌లో అడహక్ బేసిస్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రేడియోలాజికల్ ఫిజిక్స్ (మెడికల్ ఫిజిసిస్ట్) లెక్చరర్ పోస్టులకు ఈ నెల 19వ తేదీన వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ మేరకు ఖాళీగా ఉన్న 4 పోస్టులకు గాను ఎస్సీ-1, బీసీ-1, ఈడబ్ల్యూఎస్-1, ఓసీ-1 పోస్టు కేటాయించినట్లు వివరించారు. ఇతర వివరాలకు స్విమ్స్ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

# ఏదీ సిక్స్.. ఏరివేత ఫిక్స్!

**ప్రభుత్వ వైఖరితో ఆందోళనలో ప్రజలు**

- ఓ వైపు పింఛన్ల తొలగింపునకు ప్రత్యేకంగా సర్వేలు
- మరో వైపు చిరుద్యోగుల పొట్టకొట్టే చర్యలు
- ఇదే క్రమంలో ఇంటి పట్టాల రద్దుకు సన్నాహాలు
- సంక్షేమ ఫలాల తగ్గింపే లక్ష్యంగా కుట్రలు
- సూపర్ సిక్స్ సంగతి దేముడెరుగు.. ఇదేం ఖర్మ 'బాబోయ్' అంటున్న లబ్ధిదారులు

ఎన్నికల సమయంలో పలువురు అనుమానించినట్టుగానే ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. ఏరు దాటక తెప్ప తగలేసిన చందంగానే మరోసారి అడుగులు వేస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలంటూ ప్రజలను ఆశపెట్టి అధికారం చేజిక్కించుకున్నారు. పీఠం ఎక్కిన తర్వాత హామీలన్నీ తుంగలో తొక్కేస్తున్నారు. అంతటితో ఆగకుండా సంక్షేమ ఫలాల తగ్గింపే లక్ష్యంగా కుయుక్తులు పన్నుతున్నారు. అనర్హులను ఏరివేస్తున్నాంటూ అసలుకే ఎసరుపెట్టేస్తున్నారు. ఇప్పటికే పింఛనర్లను సర్వేల పేరుతో ప్రతి నెలా కుదించేస్తున్నారు. పలుశాఖల్లో చిరుద్యోగుల బతుకులను చీకట్లోకి నెట్టేశారు. పేదల సొంతింటి కలను భగ్నం చేసే దిశగా పట్టాల రద్దుకు సన్నద్ధమవుతున్నారు.



సర్వేలో భాగంగా దివ్యాంగుని ఐరిష్ నమోదు చేస్తున్న దృశ్యం (ఫైల్)

తిరుపతి అర్బన్ : కూటమి ప్రభుత్వం సర్వేల పేరుతో ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తోంది. సంక్షేమ పథకాలను సక్రమంగా అందించకుండా నిత్యం ఆందోళనకు గురిచేస్తోంది. సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు పగ్గాలు చేపట్టిన తర్వాత హామీలను పట్టించుకోవడం లేదనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఓ వైపు పింఛన్లు తగ్గించడానికి దశల వారీగా సర్వేలు చేపడుతున్నారు. గత ఏడాది జూన్‌లో 2,71,183 మందికి పింఛన్లు అందించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో 2,63,191 మందికి మాత్రమే ఇచ్చారు. కేవలం 8 నెలల్లోనే 7,992 మంది పెన్షన్లు తొలగించారు. ఈ క్రమంలోనే ఇతర పింఛన్ల లబ్ధిదారుల అర్హతపై ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగులు, మంచానికే పరిమితమైన వారిపై వేటే వేసేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించారు. మరో నెల రోజుల్లో ఈ సర్వే రిపోర్ట్‌ను వెల్లడి కానున్న నేపథ్యంలో ఎంత మందికి పింఛన్లు తొలగిస్తారో అనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. మరోవైపు చిరుద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది,, రేషన్ డీలర్లకు పార్టీల రంగుపులిమి వెయ్యిమందికి పైగా తొలగించారు.

### కొర్రీలు వేసేందుకే..

తల్లికి వందనం ద్వారా విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.15 వేలు , అన్నదాత సుఖీభవ కింద రైతులకు చెల్లించాల్సి రూ.20వేలు, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు తదితర సూపర్ సిక్స్ పథకాలను ఇప్పటి వరకు అమలు చేయలేదు. మరోవైపు తాజాగా రైతులకు గుర్తింపు కార్డు ఉంటేనే ప్రభుత్వ పథకాలు ఇస్తామని చెబుతున్నారు. జిల్లాలో 2.10 లక్షల మంది రైతులు ఉంటే కేవలం 13 రోజుల్లోనే రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ చేయించుకోవాలంటూ గడువు విధించారు. ఈ విధంగా జిల్లా ప్రజలన టెన్షన్ పెడుతున్నారు.. ఒక్క పథకం కూడా అమలు చేయకుండా.. లబ్ధిదారులను తొలగించడం ఏంటని జిల్లా వాసులు ప్రశ్నిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనర్హులకు సంక్షేమ పథకాలు అందించారని ప్రచారం చేసేందుకే సర్వేలతో కుట్రలు పన్నుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే వివిధ రకాల కొర్రీలే వేసి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేసి.. ఇదే సంపద సృష్టి అంటూ ఊదరగొట్టేందుకే అని అనుమానిస్తున్నారు. సూపర్ సిక్స్‌అమలు సంగతి దేముడెరుగు.. అందుతున్న సంక్షేమ ఫలాలను తొలగించడమేంటని లబ్ధిదారులు మండిపడుతున్నారు.

### లేఅవుట్లపై ఆరా..



జీపాళెంలో జగనన్న లే అవుట్

ప్రభుత్వ ఆదేశాల మేరకు తాజాగా జిల్లాలోని 575 జగనన్న లేఅవుట్లలో 77,765 ఇంటి పట్టాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ మేరకు రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులతో కూడిన ప్రత్యేక బృందాలతో లేఅవుట్లపై నిఘా పెట్టారు. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. లబ్ధిదారులు ఇల్లు, నిర్మించుకున్నారా? లేదా?, అలాగే నిర్మించుకున్న వారే ఉంటున్నారా? ఇతరులకు ఇచ్చారా? పట్టాలు తీసుకున్న వారికి గతంలో ఏమానా గృహాలు ఉన్నాయా? సొంత వాహనాలు ఉన్న వారు తీసుకున్నారా? ఇల్లు నిర్మించుకోకపోవడానికి కారణాలు ఎంటీ..? బేస్‌మెంట్ స్థాయిలో నిలబెట్టేందుకు కారణాలు ఏంటి అనే అంశాలపై విచారణ చేపట్టనున్నారు. మరో నెల రోజుల పాటు ఈ విచారణ కొనసాగుతుందని చర్చ సాగుతోంది. ఏది ఏమైనా పేద ప్రజలకు మంజూరు చేసిన పట్టాలు, ఇళ్ల విషయంలో ప్రభుత్వం అనర్హత పేరుతో ఏరివేతకు రంగం సిద్ధం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 30 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,192 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 20,825 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.15 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లితే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

### విద్యార్థినులకు అభినందన



ప్రతిభ చూపిన విద్యార్థినులతో అధ్యాపకులు

తిరుపతి సిటీ : గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీ వేదికగా ఈనెల 8వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నిర్వహించిన 18వ జాతీయ యువజనోత్సవాల్లో పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ విద్యార్థినులు ప్రతిభను చాటారు. బుధవారం ఈ మేరకు విద్యార్థినులను ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ అభినందించారు. 9 మంది విద్యార్థినులు స్కిట్, మైమ్ విభాగాలలో ఉత్తమ ప్రదర్శన ఇచ్చారని, బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారని ప్రిన్సిపల్ వెల్లడించారు. ఈక్రమంలోనే కళాశాల కల్చరల్ కో–ఆర్డినేటర్ కె.నాగ పద్మ, ఎస్వీయూ కల్చరల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.వివేక్‌ను ప్రశంసించారు.

# వెటర్నరీ జూడాల వినూత్న నిరసన



నిరసన తెలుపుతున్న వెటర్నరీ వైద్య విద్యార్థులు

తిరుపతి సిటీ : గౌరవ వేతనం పెంచాలంటూ రోడ్డెక్కిన ఎస్వీ వెటర్నరీ విద్యార్థుల నిరవధిక సమ్మె 10వ రోజుకు చేరింది. బుధవారం ఈ మేరకు వర్సిటీ ప్రాంగణంలో విద్యార్థులు నోటికి నల్ల రిబ్బన్ కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వెటర్నరీ జూడాల ఆకలి కేకలు వర్సిటీ అధికారులకు, ప్రభుత్వానికి వినిపించకపోవడం దారుణమన్నారు. పదిరోజులుగా తమ న్యాయమైన సమస్యను పరిష్కరించాలని ఆందోళన చేపట్టినా, వినతిపత్రాలు సమర్పించినా చలించలేదని మండిపడ్డారు. గౌవరవేతనం పెంచేవరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని, భవిష్యత్‌లో మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. తమ ఇబ్బందులను గుర్తించి అందరితో సమానంగా స్టయిఫండ్ అందించాలని డిమాండ్ చేశారు.

# బాలల రక్షణకే మిషన్ వాత్సల్య




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : బాలల సంక్షేమం, రక్షణకే మిషన్ వాత్సల్య స్కీమ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి బాలల సంక్షేమ, రక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్మన్ హోదాలో కలెక్టర్ మాట్లాడుతూ 18ఏళ్లలోపు బాలికల సంరక్షణలో భాగంగా బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడం, బాల కార్మికులు,, బెగ్గింగ్ చేస్తున్న వారిని గుర్తించి షెల్టర్ హోమ్స్‌కు తరలించాలన్నారు. వారికి బ్రిడ్జి ఎడ్యుకేషన్ అందించాలని సూచించారు. అలాగే బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. రాష్ట్రస్థాయి కమిటీ చైర్మన్‌గా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఉంటారని వెల్లడించారు. ఈ క్రమంలో కమిటీ సభ్యులు జువెనైల్ జస్టిస్ చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ వసంత బాయి, డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, డీఎస్పీ శ్రీలత, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ చిన్న లాలప్ప, జిల్లా ప్రణాళిక అధికారి ప్రేమ్ చంద్ర, తిరుపతి కార్పొరేషన్ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి పాల్గొన్నారు.

## శాస్త్రోక్తం.. త్రిశూల స్నానం



త్రిశూల స్నానఘట్టం



పంచమూర్తుల ఊరేగింపు

పట్టణంలోని స్వర్ణముఖ నదిలో బుధవారం శాస్త్రోక్తంగా త్రిశూలస్నానం నిర్వహించారు. వ్యాసపౌర్ణమిను పురస్కరించుకుని మహాశివరాత్రికి ముందు త్రిశూల స్నానం జరిపించడం ఆనవాయితీ. అందులో భాగంగా జ్ఞానప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరుడు, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, త్రిశూలానికి ఆలయ అలంకార మండపంలో విశేష పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా స్వర్ణముఖ నదీ తీరానికి తీసుకెళ్లారు. సద్యోముక్తి పురాణ ప్రవచనం చేపట్టి వైభవంగా త్రిశూల స్నానం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై పంచమూర్తులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి, బొజ్జల రిషితారెడ్డి పాల్గొన్నారు.

– శ్రీకాళహస్తి

### పాలిటెక్నిక్‌లో విద్యాకమిటీ పర్యటన

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌ను రాష్ట్ర సాంకేతిక ఉన్నత విద్యా కమిటీ బృందం బుధవారం సందర్శించింది. పలు విభాగాలతోపాటు ల్యాబ్‌ను పరిశీలించారు. కమిటీ సభ్యులు డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ జాతీయ విద్యాప్రమాణాలకు అనుగుణంగా ల్యాబ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. మార్చిలో రెండో పర్యాయం పర్యటించనున్నటు వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రిజ్వాన్, ఎన్‌బీఏ కళాశాల కో–ఆర్డినేటర్ ప్రకాష్ నారాయణ, అధ్యాపకులు భరత్, ప్రభాకర్, జోత్స్న, రజాకర్ పాల్గొన్నారు.

### బీఈడీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో గత ఏడాది నవంబర్‌లో నిర్వహించిన బీఈడీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం.దామ్లానాయక్ తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## క్లుప్తంగా

### వ్యక్తి ఆత్మహత్య

**తిరుపతి రూరల్ :** మండలంలోని లింగేశ్వరనగర్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసే గోపీ(45)కి భార్య చందన, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసగా మారిన గోపి తరచూ భార్యతో గొడవపడేవారు. పిల్లలను సైతం నిత్యం కొట్టేవాడు. దీంతో విసిగిపోయిన భార్య పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన గోపి ఇంట్లో ఉరేసుకున్నాడు. మూడు రోజులుగా గోపి బయటకు రాకపోవడం, ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కలవారు కిటికీలో నుంచి చూడగా మృతదేహం కనిపించింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ఇంటి తలుపులు పగులగొట్టి మృతదేహాన్ని తిరుపతి రుయాకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్‌కే మూర్తి తెలిపారు.

### సీఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం


విద్యార్థులతో కళాశాల డైరెక్టర్లు

**తిరుపతి సిటీ :** కోల్‌కత్తా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ బుధవారం విడుదల చేసిన ఫలితాల్ల తిరుపతి ఎల్‌బీసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ విద్యార్థులు సత్తా చాటినట్లు సంస్థ డైరెక్టర్లు ఇ.గిరిధర్, కె.విశ్వనాథ్ తెలిపారు. ఈ ఫలితాలకు సంబంధించి ఇంటర్‌లో 61.34 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. పి.నికిత్ 476, ఎస్.సౌమ్య 432, ఆర్.గణేష్ 430, పి.కుసుమ 420, ఎం.సాయి తేజ 405, కె.కీర్తి 400, కె.ద్వారకనాథ రెడ్డి 400, హర్షిత 400 మార్కులు సాధించినట్లు వివరించారు. తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

## వైభవం.. మెట్లోత్సవం


పాదాల మండపం వద్ద మెట్లకు పూజలు నిర్వహిస్తున్న ఆనందతీర్థాచార్య


హాజరైన భజన మండలి సభ్యులు

అలిపిరి పాదాల మండపం వద్ద బుధవారం వైభంగా మెట్లోత్సవం నిర్వహించారు. దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పీఆర్ ఆనందతీర్థాచార్య తొలి పూజ చేసి ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ తిరుమల శ్రీవేంకటేశ్వస్వామివారి అనుగ్రహంతో తిరుపతిలో శ్రీవారి మెట్లోత్సవం నిర్విఘ్నంగా సాగుతున్నట్లు వెల్లడించారు. అనంతరం గోవిందనామస్మరణల నడుమ సుమారు 3,500 మంది భజన మండలి సభ్యుల కాలినడకన సప్తగిరులను అధిరోహిస్తూ తిరుమలకు బయలుదేరారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. – తిరుపతి కల్చరల్

## ఎస్వీయూలో ఆరుగురికి షోకాజ్ నోటీసులు


ఎస్వీయూ పరిపాలన భవనం

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ పరిపాలనా భవనంలోని ఎగ్జామినేషన్ సెక్షన్‌లో జరుగుతున్న అవినీతిపై వర్సిటీ అధికారులు ఎట్టకేలకు కొరడా ఝళిపించారు. సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో భాగంగా విద్యార్థుల నుంచి కొందరు ఉద్యోగులు పెద్ద మొత్తంలో నగదు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ప్రత్యేక కమిటీతో విచారణ జరిపించారు. ఈ సందర్భంగా ఓ ఉద్యోగి వద్ద పెద్ద సంఖ్యలో సర్టిఫికెట్లు దొరికాయి. దీంతో ఆ ఉద్యోగిని సెక్యూరిటీ వింగ్‌కు బదిలీ చేశారు. ఈ క్రమంలో సెక్షన్‌లో జరిగిన అవినీతి భాగోతం పూర్తి స్థాయిలో వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు ఎగ్జామినేషన్ సెక్షన్‌లోని పలు విభాగాలకు చెందిన సుమారు ఆరుగురు ఉద్యోగులు అవినీతిలో భాగస్వామ్యులుగా ఉన్నట్లు విచారణ కమిటీ గుర్తించినట్లు సమాచారం. కమిటీ నివేదిక ఆధారంగా ఆ సెక్షన్లని ఉద్యోగులకు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇందులో శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు ఉన్నట్లు తెలిసింది. నోటీసులపై ఉద్యోగుల వివరణ మేరకు వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఎస్వీయూలో గత కొంత కాలంగా సర్టిఫికెట్ల జారీలో అవినీతికి పాల్పడిన ఉద్యోగులకు నోటీసులు జారీ చేయడంపై విద్యార్థి సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నా పేరు నక్కా శోభన్ కుమార్. పెద్ద పాండూరు పంచాయతీ వరదయ్యపాళెం మండలం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2023 మే 16న డ్రోన్ పైలట్‌గా గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీలో 12 రోజుల పాటు శిక్షణ పొంది సర్టిఫికెట్ తీసుకున్నా. డ్రోన్‌ను నడిపేందుకు పూర్తిస్థాయిలో తర్ఫీదయ్యా. రాయితీపై నాకు డ్రోన్ ఇస్తామన్నారు. అంతలోనే సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. తాజాగా కూటమి ప్రభుత్వంలో 80శాతం రాయితీపై డ్రోన్ల పంపిణీకి వ్యవసాయశాఖ ప్రకటన చేసింది. అయితే నాకు అర్హత ఉన్నప్పటికీ వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు అని ముద్రవేసి దరఖాస్తు తీసుకోలేదు. ప్రభుత్వం ద్వారా పంపిణీ చేసే రాయితీ యంత్రాలపై కూడా రాజకీయాలు చూపడం సరైంది కాదు. బీటెక్ పూర్తి చేసిన నేను సాంకేతిక వ్యవసాయంపై ఆసక్తితోనే డ్రోన్ పైలట్‌గా శిక్షణ పొందా. నా ఆశయానికి కూటమి ప్రభుత్వం గండి కొట్టింది.

# కూటమి కోరల్లో డ్రోన్లు!



- గతంలో శిక్షణ పొందిన పైలెట్లకు మొండిచేయి
- వ్యవసాయశాఖ అధికారులకు పచ్చనేతల హుకుం
- అధికార పార్టీ అనుయాయులకే కట్టబెట్టేందుకు రంగం సిద్ధం

**వరదయ్యపాళెం :** అన్నదాతల సాగు అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకవచ్చింది. అందులో భాగంగా పంటలకు పురుగు మందులను పిచికారీ చేసేందుకు డ్రోన్ టెక్నాలజీని ప్రవేశపెట్టింది. సాంకేతికతపై ఆసక్తి చూపే యువ రైతులను గుర్తించి, రెండు వారాల పాటు డ్రోన్ యంత్రంపై శిక్షణ ఇప్పించింది. ఈ మేరకు సర్టిఫికెట్లను సైతం అందించింది. ఈ ప్రక్రియ 2023 మే లో గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీలో పూర్తి చేసింది. శిక్షణ పొందిన వారికి రాయితీపై డ్రోన్‌లను పంపిణీ చేసేందుకు కసరత్తు చేసింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. తాజాగా ఆ పథకాన్ని కొనసాగించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. అయితే కేంద్ర ప్రభుత్వ కూడా భాగస్వామ్యం కలిగిన ఈ యాంత్రీకరణ పథకంలో డ్రోన్‌లపై అవగాహన కలిగి శిక్షణ పొందిన వారికే పంపిణీ చేయామని నిబంధనలు ఉన్నాయి. అయితే ఆ నిబంధనలకు క్షేత్రస్థాయిలో కూటమి నేతలు మోకాలడ్డుతున్నారు. టీడీపీ కార్యకర్తలకు మాత్రమే డ్రోన్లు పంపిణీ చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు హుకుం జారీ చేస్తున్నారు. అలాగే ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సైతం తాము సిఫార్సు చేసిన వారి పేర్లను మాత్రమే జాబితాలో నమోదు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే దరఖాస్తు చేసుకునే ముందే వ్యవసాయశాఖ అధికారులు మీకు స్థానిక టీడీపీ నేతలు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖ ఉందా? అని పరిశీలిస్తున్నారు. దీంతో నిజమైన అర్హులు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

### 36 డ్రోన్లు మంజూరు

జిల్లాలో 7 నియోజకవర్గాలకు గాను 8 వ్యవసాయశాఖ సబ్ డివిజన్లు ఉన్నాయి. ఈ క్రమంలో మొత్తం 36 డ్రోన్లు మంజూరయ్యాయి. ఈ యూనిట్ల కోసం శిక్షణ పొందిన డ్రోన్ పైలట్లు దరఖాస్తు

### 80 శాతం రాయితీ

ఒక్కో డ్రోన్ యూనిట్‌కు 80శాతం రాయితీ ఇస్తున్నారు. డ్రోన్ విలువ రూ. 10లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఉంటుంది. ఇందులో ప్రభుత్వం రూ. 8లక్షల వరకు రాయితీ ఇస్తుంది. మిగిలిన 20 శాతం మాత్రమే రైతు భరించాల్సి ఉంటుంది. రాయితీ ఎక్కువగా వస్తుండడంతో అనర్హులు సైతం టీడీపీ నేతల అండతో ఎగబడుతున్నారు. ఈ మేరకు పచ్చనేతలు యథేచ్ఛగా ముడుపులు తీసుకుని సిఫార్సులు చేస్తున్నట్లు సమాచారం.

చేయాలని ఆదేశించడం గమనార్హం. దీంతో చేసేది లేక వ్యవసాయశాఖ అధికారులు కూడా అధికార పార్టీ నేతలు చెప్పిన వారి దరఖాస్తులు మాత్రమే పరిగణలోకి తీసుకుంటున్నారు. అర్హత కలిగి డ్రోన్ శిక్షణ పొందిన వారిని పక్కన పెట్టేశారు. తమ చేతుల్లో ఏమీ లేదని చేతులు దులిపేసుకుంటున్నారు.

### విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి


ఆనందరెడ్డి మృతదేహం

**భాకరాపేట :** విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై లైన్‌మన్ ఆనందరెడ్డి మృతి చెందారు. వివరాలు.. బుధవారం ఉదయం ఎర్రావారిపాళెం మండలం బోడేవాండ్లపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని దేవరవాడ్లపల్లె వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పీలేరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడు ఆనందరెడ్డికి భార్య ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు.

### ట్రాక్టర్ ఢీకొని దంపతులకు గాయాలు

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని పార్లపల్లె వద్ద బుధవారం ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో దంపతులు గాయపడ్డారు. వివరాలు.. శ్రీకాళహస్తి మండలం ఉడమాలపాడుకు చెందిన ప్రసాద్(35) తన భార్య వెన్నెలతో కలసి సంతవేలూరు గ్రామంలోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మార్గం మధ్యలో ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



### మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాడ వీధుల్లో పర్యటించి భక్తుల రద్దీ మేరకు చేపట్టాల్సిన బందోబస్తుపై సూచనలు చేశారు. పార్కింగ్ ప్రాంతాలను సందర్శించారు. అనంతరం శ్రీకాళహస్తిలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్‌స్టేషన్ భవనం పనులను తనిఖీ చేశారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ హేమంత్, అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ నరసింహమూర్తి, సీఐలు గోపి, వెంకటేశ్వర్లు, తిమ్మయ్య పాల్గొన్నారు.

### తిరుమలలో మహిళ మృతి

**తిరుమల :** తిరుమలలోని రింగ్ రోడ్డుకు సమీపంలోని క్షేత్రపాలకుడి ఆలయం వద్ద కాలువలో ఓ మహిళ మృతి చెందిన ఘటన బుధవారం వెలుగుచూసింది. తిరుమల టూటౌన్ పీఎస్ సీఐ శ్రీరాముడు తెలిపిన వివరాల మేరకు. తెలంగాణ రాష్ట్రం, సంగారెడ్డికి చెందిన రవి, అరుణజ్యోతి(29) భార్యభర్తలు వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే భార్యభర్తల మధ్య వివాదమో మరేదయినా కారణమో తెలీదుగాని వారం క్రితం అరుణజ్యోతి తిరుమలకు చేరుకుంది. ఈక్రమంలో ఆమె మృతదేహం లభ్యమైంది. మృతురాలి ఫోన్‌బుక్‌లో కుటుంబీకుల నెంబర్ తెలుసుకుని పోలీసులు సమాచారం అందించారు. మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ వైద్యకళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### నేడు వెటర్నరీలో ఓపీ సేవలు బంద్

**తిరుపతి సిటీ :** గౌరవ వేతనం పెంచాలంటూ సమ్మెలో ఉన్న వెటర్నరీ జూడాలు గురువారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పశువైద్యశాలలో ఓపీ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. ప్రజలు, రైతులు తమ సమస్యలను అర్థం చేసుకుని సహరించాలని కోరారు.

### ఎస్వీయూ విశ్రాంత ఆచార్యుడి మృతి


పీవీ రామమూర్తి

**తిరుపతి సిటీ :** ఎస్వీయూ మనోవిజ్ఞాన శాస్త్ర వ్యవస్థాపక సభ్యుడు, విశ్రాంత ఆచార్యులు పీవీ రామమూర్తి(88) బెంగళూరులోని ఆయన నివాసంలో మంగళవారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, మాజీ వీసీలు జమున, శ్రీకాంత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ హరికృష్ణ, ప్రొఫెసర్ లలిత సంతాపం వ్యక్తం చేశారు.

### ఉపాధిలో అవినీతిపై ఫిర్యాదు

**చంద్రగిరి :** ఉపాధి హామీ పథకంలో అవినీతిపై అగరాల సర్పంచ్ భాస్కర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనులపై ఆడిట్ సమావేశం నిర్వహించారు. రూ.8కోట్ల పనులపై చేపట్టిన తనిఖీలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి పాల్గొన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ అగరాల పంచాయతీలో ఉపాధి పనులకు హాజరుకాకపోయినా మస్టర్లలో సంతకాలు చేయించుకుని రూ.5లక్షలకు పైగా దోచేశారని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను తప్పుదోవ పట్టించి పుష్ప అనే ఉపాధి కూలీ అక్రమంగా నిధులను దిగమింగేసిందని స్పష్టం చేశారు.

## గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

**తిరుపతి అర్బన్ :** జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయకర్త ఎం.గీత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశానికి బాలురు, బాలికలు మార్చి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 5వ తరగతి అడ్మిషన్‌కు ఏప్రిల్ 4వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు. ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని వివరించారు. అదనపు సమాచారం కోసం ఆయా ప్రాంతాల గురుకుల విద్యాలయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

**బాలికల పాఠశాలు**
శ్రీకాళహస్తి : 9704550109
సత్యవేడు : 9704550115
పుత్తూరు : 9949356330
పుదూరు : 8499922123
సూళ్లూరుపే : 9704550102
డక్కిలి : 9704550100

**బాలుర విద్యాలయాలు**
కోట : 9704550097
నాయుడుపేట : 9704550098
వాకాడు : 9704550099
చిల్లకూరు : 9848588620

**జిల్లా కో-ఆర్డినేటర్ కార్యాలయం**
7995562127
9493455514

## వేర్వేరు హత్య కేసుల్లో నిందితుల అరెస్ట్


నిందుతుడి అరెస్టు చూపుతున్న పోలీసులు


**చంద్రగిరి :** పాపయ్య నాయుడు అనే వ్యక్తి హత్యకేసులో నిందితుడు హరినాయుడును బుధవారం శ్రీవారి మెట్టు మార్గంలో అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు. వివరాలు.. పూతలపట్టు మండలం కొత్తపేట పంచాయతీకి చెందిన అన్నదమ్ములు హరినాయుడు, రాజేష్ మధ్య కొంత కాలంగా ఆర్థిక లావాదేవీలకు సంబంధించి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదిన చంద్రగిరి అరుణకాలనీకి చెందిన సమీప బంధువు పాపయ్య నాయుడు జోక్యం చేసుకుని ఇద్దరినీ పిలిపించి మధ్యవర్తిత్వం చేశాడు. ఇది నచ్చని హరినాయుడు వెంటనే పాపయ్య నాయుడుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. రుయాలో చికిత్స పొందుతూ పాపయ్య నాయుడు 9వ తేదీన మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో నిందితుడిని అరెస్ట్ చేసి, ఆయన కారును సీజ్ చేసినట్లు సీఐ వెల్లడించారు. కేసు నమోదు చేసిన 72 గంటల్లో నిందుతుడిని పట్టుకున్న సిబ్బందిని అభినందించారు.

**తిరుపతిలో..**

**తిరుపతి క్రైమ్ :** నగరంలోని శ్రీనివాసం సబ్‌వే వద్ద జనవరి 30వ తేదీన జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఈస్ట్ సీఐ రామకృష్ణ బుధవారం తెలిపారు. వివరాలు.. చీరాలకు చెందిన అంకయ్య(35) కొన్ని రోజులుగా శ్రీనివాసన్ వద్ద సబ్ వే పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో అక్కడ పనిచేస్తున్న గుంటూరు జిల్లాకు చెందిన సతీష్ బాబుతో పని నిమిత్తం చిన్నపాటి గొడవైంది. ఇద్దరి మధ్య మాటామటా పెరగడంతో అంకయ్య తలపై సతీష్ ఐరన్ రాడ్‌తో గట్టిగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన అంకయ్యను స్థానికులు వెంటనే రుయా హాస్పిటల్‌కు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఈనెల 8వ తేదీన అంకయ్య మృతి చెందాడు. దీనిపై హత్య కేసు నమోదు చేసి సతీష్ బాబును అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు.

## అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- రూ.20లక్షల బంగారం, కారు స్వాధీనం


పట్టుబడిన నగలను చూపుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

**తిరుపతి క్రైమ్ :** జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్ చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. జనవరి 18వ తేదీన శెట్టిపల్లె పంచాయతీ, తిరుమల నగర్‌లో తాళంవేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారన్నారు. బాధితుడు రవి ఫిర్యాదు మేరకు తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారని వెల్లడించారు. క్రైమ్ అడిషనల్ ఎస్పీ నాగభూషణరావు పర్యవేక్షణలో చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్‌తోపాటు తిరుచానూరు పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారని చెప్పారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం కరకంబాడి రోడ్డులోని మంగళం ఆర్టీఓ కార్యాలయం వద్ద అనుమానాస్పదంగా కొందరు సంచరిస్తుండా అదుపులోకి తీసుకున్నామని వివరించారు. విచారణలో అసలు విషయం తెలిసిందని, నిందితుల నుంచి సుమారు రూ.20 లక్షల విలువైన 277 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు రూ.40 విలువైన 550 గ్రాముల వెండి నగలు ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులైన గుంజపోగు సుధాకర్ అలియాస్ సాయి కాక అలియాస్ డేంజర్ అలియాస్ ఆంటోనిపై హైదరాబాద్‌లో సుమారు 100కు పైగా చోరీ కేసులు ఉన్నాయన్నారు. పిల్లె శేఖర్ అలియాస్ శేఖర్ యాదవ్ అలియాస్ గిరి (42)పై హైదరాబాద్‌లో 160కు పైగా దొంగతనం కేసులు ఉన్నాయని వెల్లడించారు. అలాగే గాజులపల్లి శ్రీనివాసులు రెడ్డి, అలియాస్ శ్రీను (23)పై ప్రకాశం జిల్లాలో ఒక హత్య కేసు, ఒక బ్రోతల్ కేసు, 4 చోరీ కేసులు ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. కేసును ఛేదించిన పోలీసులకు అభినందనలు తెలిపారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ బి.హేమంత్, అదనపు ఎస్పీ నాగభూషణరావు పాల్గొన్నారు.